# సకల జనుల హితుడు పోతులూరి

## శాసన సభ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి



ట్యాంక్‌బండ్‌పై గల వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి, కుందారపు గణేషా చారి, తదితరులు..

కవాడిగూడ, మే 17: విశ్వంలో జరిగే పరిణామాలను తన దివ్య దృష్టితో ముందుగానే తెలియజేసిన మహనీయుడు పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి అని శాసన సభ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనా చారి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ట్యాంక్‌బండ్‌పై గల శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి 331వ ఆరాధన మహోత్సవాన్ని విశ్వకర్మ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదనా చారి ముఖ్య అతిథిగా హాజరై పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలజ్ఞానం బోధించి సకల సనుల హితం కోరిన గొప్ప సంఘ సంస్కర్త, భవిష్యత్ దర్శి శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారపు గణేషా చారి, బీసీ కమిషన్ సభ్యుడు సీహెచ్ ఉపేందర్, విశ్వకర్మ ఫౌండేషన్ అధ్యక్షుడు అడ్లూరి రవీంద్రాచారి, సభ్యులు మహరాజ రవీందర్, జతేందర్, సంకోజు రాఘవేందర్, కొలనూరు శ్రీనివాసాచారి, వీరశేఖర్ తదతరులు పాల్గొన్నారు.

## ఇకపై ఓయూలో ఏటా పోతులూరి స్మారకోపన్యాసాలు

చెక్కును ఓయూ వీసీకి అందజేస్తున్న విశ్వకర్మ ఫౌండేషన్ ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 17: సంఘ సంస్కర్త, సర్వమత సమైక్యతను చాటి చెప్పిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞాన తత్వంపై ఇకపై ప్రతి ఏటా ఉస్మానియా యూనివర్సిటీలో స్మారక ఉపన్యాసాలు జరుగనున్నాయి. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనా దినోత్సవం సందర్భంగా ఈ స్మారక ఉపన్యాసాలు నిర్వహిస్తారు. ఈ ఉపన్యాసాలను నిర్వహించేందుకు రూ.5 లక్షల డీడీని ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్‌కు విశ్వకర్మ ఫౌండేషన్ అధ్యక్షుడు అట్లూరి రవీంద్రాచారి శుక్రవారం అందజేశారు. ఈ మొత్తాన్ని బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీతో ఏటా క్యాంపస్‌లోని ఆడిటోరియంలో ప్రముఖ వ్యక్తులచే కాలజ్ఞాన స్మారక ఉపన్యాసాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రవీందర్ మాట్లాడుతూ వీర బ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర, కాలజ్ఞానం బోధనలపై మొట్టమొదటిసారిగా ఓయూలో స్మారకోపన్యాసం నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యుడు ఉపేంద్ర, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గౌరీశంకర్, విశ్వకర్మ ఫౌండేషన్ సభ్యులు మహరాజా రవీంద్రాచారి, కీమోజు జితేందర్, సంకోజు రాఘవేందర్, కొలనూరు శ్రీనివాసాచారి, ప్రొఫెసర్ వెంకటరాజయ్య పాల్గొన్నారు.

## బీఏ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 17: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఏ లాంగ్వేజెస్ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. విద్యార్థులు తమ మార్కుమెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి, ఈ నెల 23వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 25వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 25వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్‌కు దరఖాస్తులు

మేడ్చల్ కలెక్టరేట్, మే 17: వచ్చే విద్యా సంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద 1వ తరగతిలో ప్రవేశానికి షెడ్యూల్డ్ కులాల బాల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు షెడ్యూల్డ్ కులాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. చింతల్‌లోని ఆర్ఎస్‌కే ఉన్నత పాఠశాల, కుషాయిగూడ బ్రిలియంట్ గ్రామర్ ఉన్నత పాఠశాల, కూకట్‌పల్లి బ్రిలియంట్ గ్రామర్ ఉన్నత పాఠశాల, బోడుప్పల్ పద్మశ్రీ ఉన్నత పాఠశాలలు బెస్ట్ అవైలబుల్ పథకానికి ఎంపికైనట్టు తెలిపారు. అభ్యర్థులకు మల్కాజిగిరికి చెంది ఉండాలని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1,50,000, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల లోపు ఉండాలన్నారు. విద్యార్థి వయస్సు జూన్ 1, 2024 నాటికి 5 నుంచి 6 సంవత్సరాలలోపు ఉండాలని సూచించారు. కుల, ఆదాయ ధ్రువ పత్రాలు మీ సేవ ద్వారా పొందాలన్నారు. వచ్చే నెల 7వ తేదీ వరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు లభిస్తాయని, పూరించిన దరఖాస్తులను జూన్ 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నేరుగా కార్యాలయంలో అందజేయాలన్నారు. 11వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

## ఆర్ట్స్ కళాశాలలో డిజిటల్ గదులు షురూ

తరగతి గదిని ప్రారంభిస్తున్న ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్

ఉస్మానియా యూనివర్సిటీ, మే 17: ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో డిజిటల్ తరగతి గదులను అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ముందుగా లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, ఇంగ్లిష్, తెలుగు విభాగాలలో ఈ గదులను వీసీ ప్రొఫెసర్ రవీందర్ ప్రారంభించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను ఉపయోగించుకుని విద్యార్థులకు ప్రభావవంతమైన బోధనను అందించే లక్ష్యంతో తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ఇంజినీరింగ్, టెక్నాలజీ కళాశాలల్లో మాత్రమే కాకుండా ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ తరగతుల్లోనూ ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అర్జున్ రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్, ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ తలత్ సుల్తానా, కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ రామ్ షెఫర్డ్ భీనవేణి, డాక్టర్ బాలు నాయక్, లైబ్రరీ సైన్స్ విభాగం హెడ్ డాక్టర్ జె.వివేకవర్ధన్, యూనివర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ ఏఎస్ చక్రవర్తి, డాక్టర్ ఎస్. యాదగిరి, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## యువత నైతికతకు కట్టుబడి ఉండాలి

### జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా

### ఘనంగా కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ద్వితీయ గ్రాడ్యుయేషన్ డే

జూబ్లీహిల్స్, మే 17: యువత దేశ సంపద అని.. దేశ సమగ్రత, నైతిక నాయకత్వ సూత్రాలకు కట్టుబడి ఉండాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. నగరంలోని గీతం డీమ్డ్ యూనివర్సిటీ, కిన్నెర సెమినార్ హాల్‌లో కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ద్వితీయ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా ఈ సందర్భంగా పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలను అందుకున్న విద్యార్థులను అభినందించారు. అనంతరం, విద్యార్థులను ద్దేశించి ఆయన మాట్లాడుతూ, యువత తీసుకునే నిర్ణయాలు, వారు అనుసరించే విధానాలు, ఇతరుల జీవితాలపై ప్రభావం చూపుతాయన్నారు. పబ్లిక్ పాలసీ ద్వారా భవిష్యత్‌ను రూపొందించడంలో యువత కీలక పాత్ర పోషించడంతో పాటు పబ్లిక్ పాలసీ ద్వారా న్యాయం, ధర్మం, ఉమ్మడి ప్రయోజనాలు కొనసాగించాలని అభిలషించారు. అధ్యక్షోపన్యాసం చేసిన గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ పట్టభద్రులను అభినందించారు. సంప్రదాయ అకడమిక్ సెషన్‌తో ప్రారంభమైన ఈ వేడుకలో గీతం అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు నేతృత్వంలో కేఎస్‌పీపీ విద్యార్థిని అర్చనా గుప్తా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కౌటిల్యా డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అక్బరుద్దీన్, రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణ శేఖర్, ఉప కులపతి ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం, కౌటిల్య సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ కన్వల్ పాల్గొన్నారు. పట్టాల ప్రదానోత్సవంలో భాగంగా యనమండ్ర మల్లిఖార్జున రావు బంగారు పతకాన్ని ప్రణీత పుల్లమరాజు, ప్రియా భట్కర్‌లు సంయుక్తంగా అందుకున్నారు. పబ్లిక్ పాలసీ మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో ప్రణీత పుల్లమరాజు ప్రథమ ర్యాంక్‌తో గీతం ప్రెసిడెంట్ పేరిట నెలకొల్పిన అవార్డును, బంగారు పతకాన్ని అందుకోగా, అంతర మైత్రా డీన్ అవార్డు అందుకుంది. 25 మంది కేఎస్‌పీపీ విద్యార్థులు స్నాతకోత్తర (పీజీ) డిగ్రీలను, అత్యుత్తమ ప్ర తిభ కనబరిచిన వారు బంగారు పతకాలను అందుకున్నారు.

## 23 నుంచి నిజామాబాద్‌లో క్యారమ్స్ పోటీలు

హిమాయత్‌నగర్, మే 17: ఆల్ ఇండియా ఇంటర్ ఇనిస్టిట్యూషనల్ క్యారమ్ ఛాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 23 నుంచి 26 తేదీ వరకు నిజామాబాద్‌లోని నవ్యభారతి స్కూల్‌లో నిర్వ హిస్తున్నట్లు క్యారమ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె.సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్. మదన్‌రాజ్, మీడియా కన్వీనర్ టి.ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం బషీర్ బాగ్‌లోని మెగా సిటీ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఆలిండియా క్యారమ్స్ ఫెడరేషన్‌కు అనుబంధంగా 20 ప్రసిద్ధ సంస్థల నుంచి ఆరుగురు పురుషులు, మహిళలు పాల్గొంటారన్నారు.

## ఎస్‌బీఐ సైబర్ క్రైం అవేర్‌నెస్ డ్రైవ్ ప్రారంభం

### సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నం.1930పై విస్తృత ప్రచారం

జూబ్లీహిల్స్, మే 17: ఆర్థిక సైబర్ మోసాలను అరికట్టేందుకు వినియోగదారులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ (ఎన్‌డబ్ల్యూ-1) మంజు శర్మ పేర్కొన్నారు. డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించే ప్రతి ఒక్కరు సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన ప్రాథమిక అంశాలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు. ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ (ఎన్‌డబ్ల్యూ-2) దేబాశిష్ మిత్ర, జీఎం ఏకే సారథిలతో శుక్రవారం కలిసి సైబర్ క్రైం అవేర్‌నెస్ డ్రైవ్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రచారం వాహనంతో ఎస్‌బీఐ సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నం.1930పై విస్తృత ప్రచారం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీఓ డీజీఎం జితేంద్ర కుమార్ శర్మ, సీఎం అండ్ సీఎస్ డీజీఎం మాలతీ నంబియార్, ఫైనాన్స్ అండ్ ఆపరేషన్స్ డీజీఎం సునీల్ కుమార్ గోయల్, మార్కెటింగ్ ఏజీఎం జి.రామకృష్ణ పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలోకి అడుగేద్దాం

- ఐజీబీసీ గ్రీన్ ప్రాపర్టీ షో - 2024లో ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- నిర్మాణ రంగంలో అత్యంత ప్రాధాన్యత: ఐటీ మంత్రి దుద్దిళ్ల

కార్యక్రమంలో ఐజీబీసీ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు

మాదాపూర్, మే 17: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిచేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు ఫుడ్, సివిల్ సప్లై, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఐజీబీసీ ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐజీబీసీ గ్రీన్ ప్రాపర్టీ షో 2024 కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సివిల్ సప్లై, ఫుడ్, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విచ్చేసి ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ఐజీబీసీ చైర్మన్ సి.శేఖర్‌రెడ్డి, క్రెడాయ్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ నిజమైన గ్లోబల్ సిటీగా అవతరించనుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనాన్ని పెంపొందించే విధంగా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ రంగాల్లో హైదరాబాద్ ముందుకు దూసుకుపోతుందని, హైదరాబాద్‌లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డెవలప్‌మెంట్ వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతూ వస్తున్నదని, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని అన్ని భవన నిర్మాణ ప్రాజెక్టులను పచ్చదనంగా తీర్చిదిద్దేందుకు ఐజీబీసీ ఎంతగానో కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను కల్గించాలనే ఉద్దేశంతో వినూత్న విధానాలతో అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. మెట్రో రైల్‌ను మరింత విస్తరించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో జీడీపీ వృద్ధిని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రియల్ ఎస్టేట్‌తో పాటు ఇతర రంగాల్లో తలెత్తిన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పచ్చదనాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హరిత భవనాల ప్రయోజనాలు, తక్కువ విద్యుత్ వినియోగం, తగ్గిన నీటి వినియోగం, మెరుగైన వ్యర్థాల నిర్వహణ, మెరుగైన ఆరోగ్యం అంశాలపై దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు.

### నిర్మాణానికి పాధాన్యత: శ్రీధర్ బాబు

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, హైదరాబాద్ నగరం నిర్మాణ రంగంలో అత్యంత ప్రాధాన్యతను కలిగి ఉందన్నారు. కర్బన ఉద్గారాల బారిన పడకుండా 0 శాతం కాలుష్యాన్ని నమోదు చేసే విధంగా కృషి చేయాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఐజీబీసీ చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. నగరంలో కన్‌స్ట్రక్షన్, రియల్ ఎస్టేట్‌కు అత్యంత డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు ఐజీబీసీ, క్రెడాయ్ సభ్యులున్నారు.

## 19న పరిషత్తులో సాహిత్య విమర్శ అధ్యయన శిబిరం

తెలుగు యూనివర్సిటీ, మే 17: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 19న ఆదివారం ఉదయం 10 గంటలకు సాహిత్య విమర్శ అధ్యయన శిబిరం నిర్వహిస్తున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య శుక్రవారం తెలిపారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సభలో ప్రముఖ సాహితీవేత్త ఆచార్య ఎస్వీ రామారావు ప్రధాన ప్రసంగం చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం, 'ప్రాచీన సాహిత్య విమర్శ' అనే అంశంపై ఆచార్య మసన చెన్నప్ప, విమర్శ రీతులు అంశంపై డాక్టర్ సి.మృణాళిని, విమర్శ-విమర్శకుడు అంశంపై డాక్టర్ కోయి కోటేశ్వరరావు, విమర్శ ప్రక్రియలు అంశంపై డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి, విమర్శ ధోరణులు అంశంపై డాక్టర్ డి.చంద్రశేఖరరెడ్డి, ఆధునిక సాహిత్య విమర్శ వికాసం అంశంపై డాక్టర్ వి.త్రివేణి ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

### 19న అమృతలత - అపురూప అవార్డుల ప్రదానోత్సవం

పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో గల ఆడిటోరియంలో 19న ఆదివారం సాయంత్రం పలువురికి 'అమృతలత - అపురూప అవార్డులు' ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ నెల్లుట్ల రమాదేవి శుక్రవారం తెలిపారు. 2024వ సంవత్సరానికి గాను అమృతలత జీవన సాఫల్య పురస్కారాలను సాహిత్యం- వైద్యం విభాగాలలో డాక్టర్ కేవీ కృష్ణకుమారి, డాక్టర్ ఆలూరి విజయలక్ష్మిలకు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. అపురూప పురస్కారాలను జీఎస్ లక్ష్మి (కథా రచన), ప్రొఫెసర్ సీహెచ్ సుశీలమ్మ (సాహితీ విమర్శ), శివలక్ష్మి (సినీ విశ్లేషణ), సావేరి దుర్గా భవాని (నాటక రంగం), ప్రొఫెసర్ సమతా రోష్ని (సామాజిక సేవ), నండూరి సుందరి నాగమణి (పద్య రచన), డాక్టర్ కొండపల్లి నీహారిణి (అంతర్జాల పత్రిక సంపాదకత్వం), జ్యోతిర్మయి మళ్ళ (సంగీతం-గజల్), అంజనీ యలమంచిలి (షార్ట్ ఫిలిం), గీతా హజారే (నృత్యం), ప్రేమ మాలిని (జర్నలిజం-ఎలక్ట్రానిక్ మీడియా), దేవనపల్లి వీణావాణి (కవిత్వం) ప్రక్రియలకు గాను ప్రదానం చేసి సత్కరిస్తామన్నారు. సాహితీవేత్తలు డాక్టర్ ఓలేటి పార్వతీశం, ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల, సినీ నటి తులసి పాల్గొంటారని పేర్కొన్నారు.

## తొమ్మిది నెలల చిన్నారికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 17: కేవలం తొమ్మిది నెలల వయసులోనే బేబీ వియోన 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన సుమన్, రేఖ దంపతులు ఉద్యోగ రీత్యా లండన్‌లోని బ్రాక్నెల్ నగరంలో తమ తొమ్మిది నెలల కుమార్తె పాటు ఉంటున్నారు. వీరి కుమార్తె వియోన రకరకాల వస్తువులు, జంతువుల బొమ్మలు, పక్షుల బొమ్మలు, పండ్లు, కూరగాయలు, ఆకారాలు, రంగులు ఇలా అన్నింటినీ ఫ్లాష్ కార్డ్స్‌లో అడిగిన వెంటనే గుర్తించి చూపిస్తూ తన ప్రతిభను ప్రదర్శిస్తోంది. ఇదో ఘనతగా ఆ చిన్నారి ప్రతిభను ఆన్‌లైన్‌లో పరీక్షించి, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చింతపట్ల వెంకటాచారి మెయిల్ ద్వారా డిజిటల్ సర్టిఫికెట్‌ను పంపించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, సూపర్ కిడ్స్ రికార్డ్స్, మిరాకిల్ రికార్డ్స్ సర్టిఫికెట్లను బ్రాక్నెల్ నగర రాజకీయ నాయకుడు, స్థానిక ఏరియా కౌన్సిలర్ గ్రాంట్ స్ట్రడ్లే చేతుల మీదుగా చిన్నారికి అందజేసి, అభినందించారు.

## నిమ్స్ వైద్యులకు బంగారు పతకాలు

పతకాన్ని అందుకుంటున్న డాక్టర్ అమృత గోపాలన్, డాక్టర్ శరత్ చంద్ర, డాక్టర్ సీహెచ్ వినయ్ కుమార్

ఖైరతాబాద్, మే 17: నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ నిర్వహించిన డిప్లమేట్ ఆఫ్ నేషనల్ బోర్డు (డీఎన్‌బీ) పరీక్షల్లో నిమ్స్ వైద్యులు బంగారు పతకాలు సాధించారు. 2022 - 23వ సంవత్సరానికి జరిగిన డీఎన్‌బీ పరీక్షల్లో నిమ్స్ రుమటాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అమృత గోపాలన్, ఎమర్జెన్సీ విభాగం వైద్య నిపుణులు డాక్టర్ శరత్ చంద్ర, ఇమ్యూనో హెమటాలజీ విభాగం వైద్య నిపుణులు డాక్టర్ సీహెచ్ వినయ్ కుమార్‌లు అత్యధిక మార్కులు సాధించారు. ఈ మేరకు న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్నాతకోత్సవంలో సదరు వైద్యులు బంగారు పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, డీన్ ప్రొఫెసర్ లీజా రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ తదితరులు అభినందించారు.

## డెంగీ సోకిన గర్భిణులకు ప్రొటోకాల్ ఆధారిత చికిత్స

గర్భిణితో మాట్లాడుతున్న ఫెర్నాండెజ్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ తారకేశ్వరి

అబిడ్స్, మే 17: గర్భిణులకు డెంగీ సోకితే తలెత్తే సమస్యలపై ఫెర్నాండెజ్ దవాఖానలో విశ్లేషణ జరిపారు. ఈ కార్యక్రమంలో ఫెర్నాండెజ్ దవాఖాన చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ తారకేశ్వరి పాల్గొని రోగులతో మాట్లాడారు. హాస్పిటల్‌లో నిర్వహించే ప్రోటోకాల్ ఆధారిత విధానాన్ని అనుసరించి ఐదేండ్లుగా 300 కంటే ఎక్కువ కేసులలో ప్రసూతి మరణాలను నివారించగలిగామని అన్నారు. వర్షాకాలంలో సంభవించే ప్రధాన ఆరోగ్య సమస్య డెంగీ అని గర్భధారణ సమయంలో డెంగీ సోకడం ప్రమాదకరమన్నారు. వ్యాధి ప్రారంభంలో ఎన్ఎస్ఐ యాంటిజెన్ పరీక్ష లేదా జ్వరం ప్రారంభమైన నాలుగు రోజుల తరువాత డెంగీ ఐజీఎం పరీక్ష ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు.

## కనీసం రూ.35 వేల వేతనం చెల్లించాలి

### ఆదివాసీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్

కాచిగూడ, మే 17: ప్రభుత్వం కనీస వేతనం రూ.35000 చెల్లించాలని అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మరకాల ప్రసన్న కుమార్ డిమాండ్ చేశారు. ఆదివాసీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం జరిగింది. అనంతరం, కోశాధికారి కందుల ఝాన్సీతో కలిసి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆదివాసీ గిరిజన ఉద్యోగులకు అలవెన్స్‌లు పెంచాలని డిమాండ్ చేశారు. వివిధ డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని కోరారు. ఆదివాసీ ఉద్యోగులకు గ్రాట్యుటీ రూ. 30 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం, ఆదివాసీ ఉద్యోగుల సంఘం సభ్యులందరు పీఆర్‌సీ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు రూ.కోటి ఇవ్వండి

### తెలంగాణ ఉద్యమకారుల హక్కుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు బోర్గి సంజీవ్

మాట్లాడుతున్న సంజీవ్

ఖైరతాబాద్, మే 17: తెలంగాణ ఉద్యమకారులకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ. కోటి ఆర్థిక సాయం అందించాలని తెలంగాణ ఉద్యమకారుల హక్కుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు బోర్గి సంజీవ్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైల్వే పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన తాను స్వరాష్ట్రం కోసం తపించే వాడినన్నారు. 2013 అక్టోబర్ 10వ తేదీని శాసనసభలో జై తెలంగాణ అంటూ నినదించానని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం తన ఉద్యోగాన్ని త్యాగం చేసి ఉద్యమంలో పాల్గొన్నానని తెలిపారు. తనలాంటి ఎందరో ఉద్యమకారులు సర్వం కోల్పోయారన్నారు. కాంగ్రెస్ ప్ర